క్లుప్తంగా

నెహ్రూనికేతన్‌లో ప్రపంచ అబాకస్ దినోత్సవం



తెనాలిఅర్బన్: ప్రపంచ అబాకస్ దినోత్సవాన్ని బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ స్కూల్‌లో గురువారం నిర్వంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ హైద్రాబాద్‌కు చెందిన విశ్వ ఎడ్యుటెక్ సంస్థ పర్యవేక్షణలో ఎనిమిది సంవత్సరాల నుంచి తమ పాఠశాలలోని విద్యార్థులకు అబాకస్ ప్రక్రియ ద్వారా గణితం నేర్పించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు అబాకస్ ద్వారా లెక్కలు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదరంగం చిన్నారులకు అభినందన



తెనాలి: అంతర్జాతీయ చదరంగం పోటీల్లో ప్రతిభ చూపిన ఇద్దరు చిన్నారులను కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు అభినందించారు. సిక్స్ సిగ్మా అకాడమీలో గురువారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. అంతర్జాతీయ రేటింగ్ సాధించిన గాజుల మేఘ శ్యామ్‌సాయి, అండర్-7 కేటగిరీలో ప్రతిభ చూపుతున్న ప్రభంజన్‌నాయుడు అడుసుమల్లిని కాంతారావు సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలకు ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఎం.నిరంజన్ పాల్గొన్నారు.

నీరుగారుతున్న సచివాలయ ఆశయం



తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలోని పలు వార్డు సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 10 గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉండగా వారు ముందుగా అక్కడికి వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గురువారం ఉదయం ఆరోవ వార్డు కౌన్సిలర్ కొత్రపాటి శ్రీలక్ష్మి ఆరోవ వార్డు సచివాలయంకు వెళ్లారు. సచివాలయం తెరచి ఉన్నా ఉదయం 11.30 గంటల వరకు ఒక్క ఉద్యోగి కూడా అక్కడ కన్పించలేదు. ఆ తర్వాత ఒక్కొక్కరుగా విధులకు హాజరు అయినట్లు ఆమె తెలిపారు. అలాగే అయిదో వార్డు సచివాలయంలో కూడా ఉదయం 11 గంటలకు వరకు ఒక్క ఉద్యోగి అందుబాటులో లేరు. 11.30 గంటల నుంచి ఒక్కో ఉద్యోగి వస్తూ కన్పించారని ఆమె ఆరోపించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తే ఉదయం 10 గంటలలోపే అందరు సంతకాలు చేసి వెళ్లిపోయినట్లు తమ పరిశీలనలో తెలినట్లు తెలిపారు. దీని వల్ల వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఉద్యోగులు సకాలంలో హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. అయిదు, ఆరోవ వార్డు పరిధిలోని వార్డు సచివాలయంలోని ఉద్యోగులు సమయానికి హాజరు కాలేదని విషయం తన దృష్టికి వచ్చిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

నేడు వర్గీకరణ తీర్పుపై నిరసన

తెనాలి: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక రైల్వేస్టేషను సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బాధ్యుడు, తెనాలి డివిజన్ మాలమహానాడు అధ్యక్షుడు కనపర్తి అనిల్ గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రాన్ని అందజేస్తామని వివరించారు.


ధరా ఘాతం

- ఉడకనంటున్న పప్పు దినుసులు
- అందనంటున్న కూరగాయలు
- ఆకాశన్నంటుతున్న బియ్యం ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలపై భారం

కొల్లిపర: నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకు నింగినంటుతున్నాయి. ఒక దానికి ఒకటి పోటీపడి అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న ధరలతో సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో ఏం కొనేటట్లు లేదు... ఏం తినేటట్లు లేదంటూ మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. వచ్చే ఆదాయం కంటే వ్యయం ఎక్కువవుతుందటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు నెలలుగా కూరగాయలు, బియ్యం, పప్పుదినుసులు, మాంసాహారాలు ఇలా సగటు మనిషికి అవసరమయ్యే సామగ్రి ఏదైనప్పటికీ ధరలు పెరిగి పేద, మధ్య, దిగువ తరగతి కుటుంబాలను ఇరుకున పడేస్తున్నాయి.

పచ్చడి మెతుకులు కష్టమే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ కూరగాయలు కొనాలన్నా కిలో రూ.70 ఆపై రేటు పలుకుతోంది. ఇక పప్పు దినుసులు తమ దగ్గర ఆ పప్పులేం ఉడక్వంటూ వెక్కిరిస్తున్నాయి. మాంసాహారాలు, బియ్యం తదితర ఆహార పదార్థాలు కూడా వాటి సరసనే చేరాయి. దీంతో కూర వండుకు తినలేక అతితక్కువ కూరగాయలతో చారు చేసుకుందామన్నా కష్టంగా మారిందని ప్రజలు ఆవేన వ్యక్తం చేస్తున్నారు. పోనీ పచ్చడి మెతుకులతో సరిపెట్టుకుందామనుకున్నా... నూనె, వాటికి కావలసిన సామగ్రి కొనుగోలు చేయలేని దుస్థితి. ప్రస్తుతం గత రెండు నెలలుగా ప్రభుత్వం రేషన్ సరుకులు ద్వారా పేద ప్రజలకు కంది పప్పు ఇవ్వక పోవడంతో చేసేది ఏమిలేక కంది పప్పు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కంది పప్పు బహిరంగ మార్కెట్లో కిలో రూ.170 వరకు పలుకుతోంది. అలాగే సన్న రకం బియ్యం కిలో రూ.50 నుంచి రూ.55, దొడ్డు బియ్యం రూ.45 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. ఇలా ధరలు పైకి ఎగబాకుతుండటంతో సామాన్యులకు కష్టంగా మారింది. బతకాలంటే తినక తప్పదని కొద్దోగొప్పో కొను గోలు చేయక తప్పడం లేదని వాపోతున్నారు.



మార్కెట్ లో అమ్మకానికి ఉంచిన కంది పప్పు



మార్కెట్ లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మార్కెట్ లో అమ్మకానికి ఉంచిన సన్న బియ్యం

కూరగాయల ధరలు కిలోపై ఇలా..

కూరగాయలు	ఏప్రిల్	మే	జూన్	జులై
బంగాల దుంప	40	42	45	45
టమాట	50	58	60	80
బెండ	35	40	40	40
దొండ	10	20	35	30
కాకర	170	170	130	130
బీర	70	80	30	40
దోశ	30	35	35	35
క్యారెట్	40	45	50	50
వంకాయ	60	70	80	70

గడిచిన నాలుగు నెలలుగా నిత్యావసర ధరల పెరుగుదల(కేజీ..రూ.ల్లో)

సరుకుల పేర్లు	ఏప్రిల్	మే	జూన్	జులై
కందిపప్పు	160	170	180	170
పామాయిల్, శనగ నూనె	100 150	110 150	120 180	120 180
చింత పండు	195	200	200	200
మినుములు	120	130	130	125
చిన్న ఉల్లి పాయలు	190	200	200	202
ఉల్లి పాయలు	30	40	40	45
సర్ఫ్	98	100	104	104
ఇడ్లీ రవ్వ	45	45	50	50
పంచదార	45	45	50	50
దనియాలు	90	95	100	100
బియ్యం (లావు) బియ్యం(సన్నాలు)	40 50	45 52	47 55	50 55

వీటితో పాటు సుగంధ ద్రవ్యాలు కూడా రూ.5 నుంచి రూ.10ల వరకు పెరిగాయి.

ధరలను నియంత్రించాలి

పెరుగుతున్న ధరలతో భయంగా ఉంది. కొంత కాలంగా కూరగాయల రేట్లు పెరుగుతూ ఉన్నాయి. కోడి గుడ్డు ధర రూ.7కు చేరింది. ఏం కొని తినాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం పేద వారిని దృష్టిలో పెట్టుకొన్ని ఇప్పటి కైన ధరలను నియంత్రించి, ప్రజలను ఆదుకోవాలి. కొల్లిపర మండల కేంద్రంలో రైతు బజార్ ఉంటే బాగుంటుంది.. రేషన్ సరుకుల పంపిణీలో పంచదార, కంది పప్పు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– జి.ఝూన్సీ గృహిణి, కొల్లిపర

ప్రభుత్వం ఆదుకోవాలి

రోజు రోజుకు నిత్యఅవసర సరుకులు, కూరకాయలు ధరలు పెరుగుతున్నాయి. దీనితో కూలీ, నాలీ చేసుకొని జీవిస్తున్న మాలాంటి చాలమంది ధరలు పెరగటంతో.. చూసి మరీ వంటలు ఉండాల్సి వస్తుంది. ఇటువంటి సమయంలో పేదల కొరకు ప్రభుత్వం చొరవ తీసుకొని ధరలు నియంత్రించటం లేదా రేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవారికి రేషన్ సరుకులతో పాటు తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు, కూరకాయలు అందించితే బాగుంటుంది..

– ఎ.శ్రీలత, గృహిణి, తూములూరు

12న అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: రణరంగ చౌక్ వద్ద ఈ నెల 12న నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. రణరంగచౌక్‌ను గురువారం సాయంత్రం వారు పరిశీలించారు. సభ స్థలిని పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన చర్యలపై ఆరా తీసి.. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో తెనాలి ప్రాంత వాసులు ఎందరో అశువులు బాశారని గుర్తు చేశారు. వారిని స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం దీనిని ఏర్పాటు చేయటం జరుతుందన్నారు. ముఖ్య అతిథులుగా పలువురు ప్రజా ప్రతినిధులు హాజరు అయ్యే అవకాశం ఉందన్నారు. అందరు దీనిలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, డీఈ సుబ్బారావు, ఏసీపీ సుబ్బారావు, పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్మి కంపోస్ట్ విక్రయించేలా చర్యలు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: మున్సిపల్ పరిధిలోని వర్మి కంపోస్ట్ యూనిట్‌లో ఉత్పత్తి అయిన కంపోస్ట్‌ను నగర దీపికలు ఇంటింటికీ వెళ్లి విక్రయించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డును గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపోస్ట్ యూనిట్‌లో మూడు టన్నుల ఉత్పత్తి ఉందన్నారు. అది మొక్కల పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. దానిని విక్రయించటం వల్ల మున్సిపాలిటీకి కొంత ఆదాయం కూడ సమకూరుతుందని చెప్పారు. అనంతరం కుక్కల శస్త్ర చికిత్సాలయంను పరిశీలించారు. ఆవరణలోని వర్షపు నీటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. రెండురోజుల్లో కుక్కలకు శస్త్ర చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, డీఈ నాగ భూషణం తదితరులు ఉన్నారు.

ఎర్రజెండా ముద్దు బిడ్డ నాగిరెడ్డి

కొల్లిపర: ఎర్రజెండా ముద్దుబిడ్డ, పేదల పక్షపాతిగా కడవరకు కొల్లిపర మండలంలో కమ్యూనిస్టుగా నిలిచి, అనేకమంది పేదలకు సేవలు అందించి కామ్రేడ్ గుదిబండి నాగిరెడ్డి ధన్యజీవి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో జీవీఆర్ కల్యాణ మండపంలో సీపీఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షతన నాగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రమాదేవి పాల్గొని సభలో మాట్లాడుతూ కందుకూరి, గురజాడ వంటి నాయకుల ఆశయాలను పుణికిపుచ్చుకున్న నాగిరెడ్డి గతంలో సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా నిలిచి ఆచరణలో అమలు చేసిన అసాధారణ వ్యక్తిగా మండలంలో పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ విధానాలను నమ్మి ఆచరణలో అమలు చేయడం నాగిరెడ్డికే సాధ్య పడిందన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.భావన్నారాయణ మాట్లాడుతూ లోతైన అధ్యయనం, పరిశీలన చేయటమేకాక, కార్యకర్తలకు సాహితకచం అందించి ప్రోత్సహించే వ్యక్తి నాగిరెడ్డి అని అన్నారు. తొలుత నాగిరెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో తెనాలి కార్యదర్శి కొల్లిపర బాలు ప్రసాద్ , పి.నరసింహారావు , కోట చంద్రశేఖర్‌రావు, కె.బెన్‌హర్, బాలరాజు, సుబ్బారావు, హుస్సేన్‌వలీ , ఎస్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి

అక్షయపాత్ర సేవలు భేష్

జాయింట్ కలెక్టర్ భార్గవతేజ

మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరాలో అక్షయపాత్ర సేవలు భేష్ అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ప్రశంసించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కనున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం తయారీ మిషనరీ, కూరగాయలు, బియ్యం శుభ్రం చేసే విధానం, తయారైన భోజనాన్ని వాహనాల ద్వారా ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అంశాల్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వండిన భోజనాన్ని రుచి చూశారు. నాణ్యతతో పాటు రుచిగా ఉండటం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మావతి, తహసీల్దార్ షేక్ మాబు సుభాని, అక్షయపాత్ర ప్రతినిధులు రామనరేష్ దాస, శ్రీహరి నాయుడు పాల్గొన్నారు.



భోజన తయారీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రశాంతంగా ముగిసిన స్కూల్ యాజమాన్య కమిటీల ఎన్నిక

తెనాలిఅర్బన్: విద్యాశాఖ ఆదేశాల మేరకు తెనాలి పట్టణం, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తెనాలి పరిధిలో ని 98 పాఠశాలల్లో ఉదయం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకుని వారితో కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించే ప్రధానోపాధ్యాయులు ప్రమాణం చేయించారు. కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలికల హైస్కూల్‌లోని ఎన్నికలను జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె. విజయలక్ష్మి, ఎంఈవో-1 మేకల లక్ష్మీనారాయణ నిర్వహించారు. అలాగే ఎంఈవో-2 జయంతిబాబు పట్టణంలోని ఎస్‌ఎస్‌ఎస్‌ఎంహెచ్ స్కూల్, ఎన్‌సీఆర్‌ఎన్‌ఎంహెచ్ స్కూల్, కేఎస్‌ఎంహెచ్ స్కూల్స్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో గెలుపొందిన కమిటీతో వారు ప్రమాణస్వీకారం చేయించారు.

ఏకగ్రీవంగా ఎస్ఎంసీ ఎన్నిక

తెనాలిరూరల్: కంచర్లపాలెం ప్రాథమిక పాఠశాల స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. కమిటీ చైర్మన్‌గా వేమవరపు సుబ్రహ్మణ్యం, వైస్‌చైర్మన్‌గా బుల్లా నవీనలను ఎన్నుకున్నారు. నూతన కమిటీని కోపల్లె శ్రీనివాస్, చుక్కపల్లి భరత్, కఠెవరపు అజయ్ బాబు, కఠెవరపు క్రాంతి, రావూరి అనిల్ అభినందించారు.



ఎన్నికైన కమిటీతో ఏపీసీ విజయలక్ష్మి, ఎంఈఓ లక్ష్మీనారాయణ

ప్రశాంతంగా పేరెంట్స్ కమిటీ ఎన్నికలు

కొల్లిపర: మండలంలోని 44 పాఠశాలలో ఎంఈవో1 జి. సాల్మన్‌రాజ్, ఎంఈవో2 కె.ఝాన్సీలత ఆధ్వర్యంలో గురువారం ఆయా పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ 44 పాఠశాలో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహించగా 572 మంది మెంబర్లు ఎన్నికయ్యారు. వీరిలో 44 మంది చైర్మన్‌లు, 44మంది వైస్‌చైర్మన్‌లు నియమితులైయారు. మిగిలిన 484 మంది ఆయా పాఠశాలో కమిటీ మెంబర్లుగా ఉన్నారు. మండల కేంద్రం కొల్లిపరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా సంగీతరావు, వైస్‌చైర్మన్‌గా గరిక ఝాన్సీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మున్నంగి పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్

తెనాలి: కొల్లిపర మండల గ్రామం మున్నంగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కు 'ఎన్‌క్వాస్' సర్టిఫికెట్ లభించింది. గుంటూరు కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటైన సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక అందుకున్నారు. 'నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్' (ఎన్‌క్వాస్) ప్రకారం మున్నంగిలోని పీహెచ్‌సీ నిర్వహణకు గల విధివిధానాలను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి పాల్గొన్నారు. ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌ను స్వీకరించిన డాక్టర్ వేముల ప్రియాంకను తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి అభినందించారు.



జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నుంచి సర్టిఫికెట్ స్వీకరిస్తున్న డాక్టర్ వేముల ప్రియాంక

సినీ ప్రేక్షకుల హృదయాల్లో చిరంజీవి మోదుకూరి జాన్సన్

90వ జయంతి సభలో పుష్పాంజలి

తెనాలి: సమాజ చైతన్యానికి తోడ్పడే రచనలతో కవి, నాటక, సినీ రచయిత మోదుకూరి జాన్సన్ ఇప్పటికీ సినీప్రేక్షకుల హృదయాల్లో చిరంజీవిగా ఉన్నారని గురువారం జరిగిన జయంతి సభలో పలువురు నివాళులర్పించారు. మోదుకూరి జాన్సన్ 90వ జయంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మోదుకూరి జాన్సన్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటూరు కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్ర సాంఘిక సలహామండలి మాజీ సభ్యులు ఆరుగొలను జాస్మిన్ మాట్లాడారు. కృషి, పట్టుదలతో జాన్సన్ గొప్ప నాటకకర్తగా, సినీ రచయితగా ఎదిగారని సోదాహరణంగా చెప్పారు. జాన్సన్‌కు తమ కుటుంబంతో గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ తెనాలిలో న్యాయవాదిగా కెరీర్‌ను ప్రారంభించిన జాన్సన్, సినీ, నాటకరంగాల్లో గొప్ప రచయితగా రాణించటం గర్వకారణమన్నారు. పాడిపంటలు సినిమాలో జాన్సన్ రచించిన 'మన జన్మ భూమి-బంగారు భూమి' పాట, కరుణామయుడు సినిమాలో 'కదిలిందీ కరుణరథం' పాటల విశిష్టతను తెలియజెప్పారు. జాన్సన్ జీవితచరిత్రను వెలుగులోకి తీసుకొచ్చిన గుంటూరు కృష్ణను అభినందించారు. జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్, ప్రఖ్య చిల్డ్రన్ ఆర్ట్స్ థియేటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, న్యాయవాదులు కొమ్ము అబ్రహాం లింకన్, మందపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మోదుకూరి జాన్సన్ చిత్రపటం వద్ద నివాళి

శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక షరాఫ్ బజారులోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సభకు నూతన అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వర్ణ ఆభరణాల తయారీ, వ్యాపారంలో తెనాలికి రాష్ట్రవ్యాప్త గుర్తింపు ఉందని, ఆ గౌరవాన్ని కొనసాగేలా చూడాలని ఆయన కోరారు. స్వర్ణకార వృత్తిలో కొనసాగుతున్న వేలాదిమంది సంక్షేమం, ఆరోగ్యం చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇరుకైన గదుల్లో పనిచేస్తున్నందున అనారోగ్య పాలవుతున్నారని చెబుతూ, స్వర్ణకారులకు మున్సిపల్ కార్యాలయం వెనుక నిర్మాణంలో ఉన్న భవనాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక మంత్రి నాదెండ్ల మనోహర్ అనుమతితో కేటాయిస్తామని ప్రకటించారు. స్వర్ణకారుల సమస్యలపై రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ వివరించారు. నూతన కార్యవర్గ కార్యదర్శి షేక్ నాసర్ అహ్మద్, కోశాధికారి మునగాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కొమ్మూరి రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహిద్దీన్‌తోపాటు ఉపాధ్యక్షులు, సహాయకార్యదర్శులు ప్రమాణస్వీకారం చేశారు. తెనాలి జ్యూయలరీ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి వెల్లంపల్లి సత్యనారాయణ, కౌన్సిలరు పసుపులేటి త్రిమూర్తి, వెండివర్తకుల సంఘం అధ్యక్షుడు పఠాన్ ఫజిల్‌ఖాన్, కార్యదర్శి పఠాన్ జిలానిఖాన్, పట్టణ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు గుంటముక్కల నాగార్జున హాజరై, నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న సంఘ నేతలు